చర్యలు శూన్యం

- అనుమతులు లేకుండా కార్యాలయ భవన నిర్మాణం
- నోటీసులతో సరిపుచ్చిన కర్నూలు కార్పొరేషన్ అధికారులు
- వైసీపీతో అంటకాగుతున్న ఓ అధికారి


ఏపీ ఆగ్రోస్ స్థలంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

కర్నూలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ కార్యాలయం పేరిట చేపట్టిన ప్యాలెస్ నిర్మాణం అది. ఎలాంటి అనుమతులు లేవని కుడా, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిగ్గు తేల్చారు. ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసినా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పి.. ఇప్పటికీ ఆ పార్టీతో అంటకాగుతున్న కార్పొరేషన్‌కు చెందిన కీలకమైన అధికారి ఒకరు తెరవెనుక చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే వైసీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ ఇంటికి ఓ వ్యక్తిని పంపించి.. 15 రోజులు గడువు కోరుతూ కేఎంసీ నోటీసుకు సమాధానం ఇవ్వమని ఆ అధికారి సలహా ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ మేరకు సమాధానం ఇచ్చారే తప్ప ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించలేదని తెలుస్తున్నది. రైతుల అవసరాలు తీర్చడానికి ఇచ్చిన స్థలాన్ని వైసీపీ ఆఫీసుకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధం. దీన్ని తిరిగి ఏపీ ఆగ్రోస్‌కే ఇవ్వాలని ఆ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు ఏపీ ఆగ్రోస్ ఎండీకి లేఖ రాశారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

కర్నూలు నగరం రైల్వే స్టేషన్ (ఆర్ఎస్) రోడ్డు ఐదు రోడ్ల కూడలిలో ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆగ్రోస్ సంస్థ)కు సర్వే నంబరు 95-2బీలో 1.60 ఎకరాల భూమి ఉంది. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ రూ.100 కోట్లు పైమాటే. గత జగన్ ప్రభుత్వంలో ఈ భూమిపై వైసీపీ నాయకులు కన్నేశారు. మొత్తం 1.60 ఎకరాలు వైసీపీ కార్యాలయం నిర్మాణం కోసం 33 ఏళ్ల లీజుకు ఇస్తూ.. 2023 ఆగస్టు 15న గత వైసీపీ ప్రభుత్వం జీవో జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. అయితే.. ఆనాడు వైసీపీ నాయకుల అధికారం బలం, ప్రశ్నిస్తే సీఐడీ కేసులు పెట్టి వేధిస్తారనే భయంతో ఏ ఒక్కరూ ప్రశ్నించలేని పరిస్థితి. ఈ అక్రమాన్ని ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. అయినా.. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం ఏడాదికి రూ.1,600 లీజుకు కారుచౌకగా వైసీపీకి కట్టబెట్టడం ప్రజల్లో భారీ ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.


వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్న స్థలం వద్ద ఏపీ ఆగ్రోస్ బోర్డు

ఏపీ ఆగ్రోస్‌కే ఇవ్వండి

కర్నూలు నగరంలో రూ.కోట్లు విలువైన ఏపీ ఆగ్రోస్ భూమిని గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా ఆ పార్టీ కార్యాలయం కోసం 33 ఏళ్ల లీజుకు ఇచ్చింది. వైసీపీ నాయకుడైన ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చారు. లీజును రద్దు చేసి తిరిగి ఏపీ ఆగ్రోస్ సంస్థకు కేటాయించాలని కోరుతూ ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బీవీ వెంకటరెడ్డి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఇక్కడ వ్యవసాయ అవసరాలైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ వంటి వాటి కోసం వినియోగించాలి. ఇందుకు విరుద్ధంగా రాజకీయ పార్టీ ఆఫీసుకు లీజుకు ఇవ్వడం సరైనది కాదంటూ ఆ లేఖలో పేర్కొన్నారు.

15 రోజుల గడువు కోరుతూ రిప్లై ఇచ్చారు

ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన వైసీపీ కార్యాలయం రెండు అంతస్తుల నిర్మాణం చివరి దశకు వచ్చాయి. ఈ అక్రమ నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోరాదో కోరుతూ ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని కర్నూలు కార్పొరేషన్ కమిషన్ గత నెల 24న నోటీసు జారీ చేశారు. 15 రోజులు గడువు ఇస్తే నోటీసులో సూచించిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేస్తామని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు రిప్లై సమాధానం ఇచ్చారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, కుడా వైస్ చైర్మన్, కర్నూలు

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి..?

వైసీపీ కార్యాలయ నిర్మాణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించిన కుడా అధికారులు అక్రమ నిర్మాణమే అని నిగ్గు తేల్చారు. అక్రమ నిర్మాణాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజకు జూన్ 22న లేఖ రాశారు. దీని ఆధారంగా నోటీసు అందిన ఏడు రోజుల్లోగా డాక్యుమెంట్లతో పాటు సరైన సమాధానం ఇవ్వకపోతే ఏపీఎంసీ చట్టంలోని సెక్షన్ 452(1), 461(1) మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడికి గత నెల 24న నోటీసులు ఇచ్చారు. అయితే.. నోటీసులు జారీ చేసి ఏడు రోజులు దాటిపోయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల సేవలో తరించి.. ఇప్పటికీ ఆ పార్టీకే అంటకాగుతున్న కార్పొరేషన్‌కు చెందిన కీలకమైన అధికారి ఒకరు వైసీపీ కార్యాలయం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా.. నోటీసు పంపిన రెండు మూడు రోజులకు తనకు సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తిని వైసీపీ ముఖ్య నాయకుల వద్దకు పంపించి కార్పొరేషన్ ఇచ్చిన నోటీసుకు 15 రోజులు గడువు కోరుతూ సమాధానం ఇవ్వమని ఆ అధికారి ఉచిత సలహా ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఆ అధికారి సూచన మేరకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు వెకేట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ), కర్నూలు అర్బన్ తహశీల్దారు సంతకంతో భూమి స్వాధీనం చేసిన పత్రాలు, కర్నూలు అర్బన్ తహశీల్దారు జారీ చేసిన సర్వే నంబరు 95/2బీ ఎఫ్ఎంబీ రికార్డు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి జారీ చేసిన ఈసీ.. వంటి డాక్యుమెంట్ సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. సామాన్య ప్రజలు చిన్న ఇల్లు కట్టుకోవాలనుకుంటే అనుమతి లేదంటూ వాలిపోయే పట్టణ ప్రణాళిక అధికారులు ఏడాదిగా ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాడు కళ్లకు గంతలు కట్టుకున్నారా..?

వైసీపీ కార్యాలయానికి 33 ఏళ్ల లీజుకు ఇస్తూ గత జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవోను బయట పెట్టకుండా జాగ్రత్త పడ్డారు. ఎందుకంటే.. ప్రజాస్వామ్యవాదులు ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తారేమో..? అనే భయంతోనే జీవోను తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం జీవో ఇవ్వగానే ఆనాటి ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్న ఓ కాంట్రాక్ట్ సంస్థ ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు మొదలు పెట్టారు. అక్రమంగా భారీ భవంతి నిర్మిస్తోంటే కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అనుమతులు తీసుకోవాలనే కనీస విజ్ఞత లేకుండా అధికారం మాటున అక్రమ నిర్మాణం చేపట్టారు. 'అధికార పార్టీనా మజాకా..! శీర్షికన ఆంధ్రజ్యోతి వైసీపీ ఆఫీసు అక్రమ నిర్మాణాన్ని 2023 ఆగస్టు 7న వెలుగులోకి తెచ్చింది. ఈ కథనంలో ఉలిక్కిపడ్డ వైసీపీ నాయకులు అదే నెల 31న రూ.10 వేలు అప్లికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసి వదిలేశారు. ఆ తరువాత పర్మిట్ ఫీజ్, గ్రీన్ ఫీజ్ ఆన్‌లైన్‌లో చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఆనాడు మాదే అధికారం.. మమ్మల్ని ఎవరు ప్రశ్నిస్తారు..? అనే ధీమాతో ఆ పార్టీ నాయకులు ఉన్నారు. ఫైవ్ రోడ్స్ జంక్షన్ మీదుగా కలెక్టరు, కుడా వైస్ చైర్మన్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ) వంటి ఉన్నత అధికారులు నిత్యం రాకపోకలు సాగించినా.. అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం మాత్రం వారికి కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒకవేళ కనిపించినా మాకెందుకు అంటూ కళ్లకు గంతలు కట్టుకున్నారా..? వారికే తెలియాలి. ఈ నెల 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో వైసీపీ ముఖ్య నాయకుల్లో అలజడి మొదలైంది. గత నెల 18న లెబర్ సెస్ కాంపోనెంట్-1, లేబర్ సెస్ కాంపొనెంట్-2 ఫీజులు చెల్లించి కీలకమైన డాక్యుమెంట్లు లేకుండా కుడాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కర్నూలులో వైసీపీ ప్యాలెస్..! శీర్షికన అక్రమ నిర్మాణాలపై మరోసారి ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.




నిర్మాణంలో ఉన్న వైసీపీ ప్యాలెస్

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

కలెక్టర్ పి. రంజిత్‌బాషా


అర్జీలను స్వీకరస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా జిల్లా, మండల స్థాయి అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో బియాండ్ ఎస్ఎల్ఏ లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టండి: జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి లెప్రసీ కేస్ డిటక్షన్ క్యాంపెయిన్‌కు సంబంధించిన వైద్య అధికారులతో కలెక్టర్ సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై 1630 టీమ్స్ (ఆశా, వలంటీర్లు) ద్వారా జిల్లా వ్యాప్తంగా సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కే.మధుసూదన్‌రావు, జిల్లా వైద్యాధికారి డా.ప్రవీణ్ కుమార్, జిల్లా కుష్ఠు ఎయిడ్స్ నివారణ టీబీ అధికారి డా.భాస్కర్, జిల్లా న్యూక్లియస్ ఆఫీసర్ డా.మల్లికార్జున రెడ్డి, డీపీఎంవోలు హక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వెంకటనాయుని పల్లెలో ఉద్రిక్తత

- పలువురు ఇళ్లపై ఓ వర్గం దాడులు
- టీవీలు, బైకులు ధ్వంసం
- ఓ ఇంటికి నిప్పు

డోన్, జూలై 8: పొలం గట్టు తగాదా కారణంగా డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లెలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం ఉదయమే ఓ వర్గం వారు పలువురి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. బైకులు ధ్వంసం చేయడంతోపాటు ఓ ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా గ్రామంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మండలంలోని వెంకటనాయునిపల్లెలో మాజీ సర్పంచ్ మాదయ్యకు ప్రకాష్‌నాయుడులకు పొలం గట్టు విషయంలో ఎన్నో ఏళ్లుగా తగాదా నడుస్తోంది. ఆదివారం రాత్రి పొలం తగాదా గట్టు కారణంగా చెన్నయ్య నాయుడు, ప్రకాష్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, రంగన్న నాయుడు, వెంకటరమణమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవి వేటకొడవళ్ల, కత్తులు, కట్టెలు, వేటు కొడవళ్లతో మాజీ సర్పంచ్ మాదయ్యపై మూకుమ్మడిగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మాదయ్యను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి సోదరుడు రామాంజనేయులు, అతని అనుచరులు సోమవారం ప్రత్యర్థుల ఇళ్లపై దాడికి దిగారు. చెన్నయ్య నాయుడు, ప్రకాష్‌నాయుడు ఇళ్లలోకి దూరి టీవీలు, వంట సామగ్రిని ధ్వంసం చేశారు. ఇంటి బయట ఉన్న రెండు బైకులను ధ్వంసం చేశారు. అదేవిధంగా ప్రకాష్ నాయుడు ఇంటికి నిప్పు పెట్టారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.


వెంకటనాయునిపల్లె దాడిలో ఇంటికి పెట్టిన నిప్పు

వెంకటనాయునిపల్లెలో పికెట్

దాడుల నేపథ్యంలో వెంకటనాయునిపల్లెలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు.


మంటలను ఆర్పుతున్న పోలీసులు

ప్రాణహాని జరిగే వరకు చర్యలు తీసుకోరా..?

అడవిని వదలి అరటి తోటల్లో చిరుతపులి సంచారం



మహానంది, జూలై 8: చిరుతపులి ద్వారా ప్రాణహాని జరిగే వరకు చర్యలు తీసుకోరా అంటూ అటవీశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణిపై మండల ప్రజలు, రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మహానంది మండలం బుక్కాపురం సమీపంలోని అరటి తోటల్లో సోమవారం ఉదయం చిరుతపులి సంచరించి వెళ్లింది. పాదముద్రలు చూసిన అరటి తోటల రైతులు పులి తిరిగినట్లు గుర్తించారు. ఇక చిరుత రూటు మార్చుకొని నల్లమల అడవి పరిసరాలు వదలి పంటపొలాల్లో సంచరించడం మొదలు పెట్టడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.. తమకు ప్రాణహాని తథ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా మహానంది క్షేత్ర పరిసరాల్లో సంచరించిన చిరుత పంట పొలాల దారి పట్టడంతో రైతులు, కూలీలు బిక్కు బిక్కుమంటూ కాలం గడిపే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు చిరుతను బంధించి జూకు తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు

- సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం
- ఎస్పీ జి. కృష్ణకాంత్

కర్నూలు, జూలై 8: స్థానిక కొత్తపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. కృష్ణకాంత్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 75 ఫిర్యాదులు వచ్చాయి.

- హైదరాబాదులో తక్కువ రేటుకే బంగారం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసిన అశోక్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రాలయం మండలానికి చెందిన లక్ష్మి ఫిర్యాదు చేసింది.
- చీటీల పేరుతో నమ్మించి రూ.7 లక్షలకు పైగా డబ్బులు వసూలు చేసి పరారైన చిత్రాల సాయిబాబాపై చర్యలు తీసుకోవాలని కర్నూలు కల్లూరు మండలం పెద్దపాడుకు చెందిన అశోక్ ఫిర్యాదు చేశారు.
- శ్రీలక్ష్మి వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ హౌసింగ్ పేరుతో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి రూ.35 లక్షలు తీసుకుని బిల్డర్స్ నాగేంద్రుడు, సోమయ్య ఆచారి మోసం చేశారని కోడుమూరుకు చెందిన అరుణ ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.15 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

ఉద్యోగ భద్రత కల్పించాలి



పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, 104 ఉద్యోగులు

కల్లూరు, జూలై 8: 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కోరారు. సోమవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన 104 ఉద్యోగులతో కలిసి గౌరు చరితమ్మకు వినతిపత్రం అందించారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేయాలని ఆమెను కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గౌరుచరిత హామీ ఇచ్చారు. సంఘం నాయకులు వెంకటేష్, చంద్రహాస్, మంజుల, కళ్యాణి, మధుసూదన్‌రాజు, వినోద్, హాసన్, షరీఫ్ ఉన్నారు.

దాస్‌పైలాను అరెస్టు చేయాలి



ధర్నా చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 8: బ్రాహ్మణులను అవమానించే విధంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో వీడియో పెట్టిన దాస్‌పైలాపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం నగరంలోని వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు కలెక్టరేట్ ముందు గల గాంధీజీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘాల నాయకులు సండేల్ చంద్రశేఖర్, సముద్రాల శ్రీధర్, దేవెళ్ల సాయినాథ శర్మలు మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో స్మార్త వర్గం వారిని అధములని వికృత వ్యాఖ్యలు చేస్తూ ఒక వీడియో ద్వారా దుర్భాషలాడిన దాస్‌పైలాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు పెద్దపీట వేశారని, అయితే కొందరు కావాలని దురుద్దేశ్యపూర్వకంగా తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. అనంతరం వినతి పత్రాలను కలెక్టర్ రంజిత్‌బాషాతోపాటు పోలీసు ఉన్నతాధికారికి సమర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు కొలుకుల చంద్రశేఖర్, దేవెళ్ల వసంత సాయినాథ శర్మ, టీవీ రవిచంద్ర శర్మ, సముద్రాల శ్రీధర్‌బాబు, కంచుగంటల శ్యామసుందర్‌రావు, మామిళ్లపల్లి రాజేశ్, రెంటచింతల సుధాకర్‌శర్మ, శంకర్‌దత్త, సునీల్ శర్మ, నరేష్ శర్మ, శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫోన్ ద్వారా సమస్యలను తెలపండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 8: కర్నూలు నగర పాలక సంస్థ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హలో కేఎంసీ.. పేరుతో సాధారణ సమస్యల పరిష్కారానికి ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రజలు ఫోన్ ద్వారానే ఫిర్యాదు చేసే వెసులుబాటును కల్పించింది. 7422992299 హెల్ప్‌లైన్ నెంబర్‌తో కాల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగునీటి సరఫరాకు అంతరాయం, చెత్త సేకరణ, పూడికతీత, వీధి దీపాలు, రోడ్డు మరమ్మతులు ఫాగింగ్ వంటి సమస్యలకు పైనెంబర్‌కి ఫోన్ కానీ వాట్సాప్ ద్వారా సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు సమస్యలని తెలపవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

12న జిల్లా స్థాయి జంప్ రోప్ పోటీల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 8: జిల్లా స్థాయి సబ్ జూనియర్ అండర్-12, 14 జంప్‌రోప్ ఎంపిక పోటీలు ఈనెల 12న నందికొట్కూరులోని నవనంది ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ బి.జోసెఫ్, జాకిర్ హుశేన్ సోమవారం తెలిపారు. జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు నంద్యాల జిల్లాలో 27, 28 రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 8790708391 నెంబరును సంప్రదించాలని సూచించారు.

29న జిల్లా స్థాయి యోగా పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 8: నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 20న జిల్లా స్థాయి యోగా సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల, స్త్రీ, పురుషుల విభాగాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతోపాటు పాఠశాల, కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలన్నారు. ప్రతిభ కన బరిచిన క్రీడాకారులను త్వరలో విశాఖపట్నంలో జరగబోయే 49వ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 7732089440, 9030506627 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు పంచాయతీ వేలం పాటలు

కోడుమూరు, జూలై 8: కోడుమూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలు మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వారపు సంత మార్కెట్, దిన మార్కెట్, మాంసం మార్కెట్‌కు సంబంధించిన వేల పాటలు నిర్వహిస్తున్నామని అన్నారు. వేల పాటలో పాల్గొనే వారు వారపు, దిన మార్కెట్ వేల పాటలో పాల్గొనే వాళ్లు రూ.3లక్షలు డిపాజిట్ చెల్లించాలని, అలాగే మాంసం మర్కెట్ వేలం పాటలో పాల్గొనే వారు రూ.50వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. ఈ వేలం పాటలు దక్కించుకొన్న రోజు నుంచి 2025 మార్చి 31 వరకు 9నెలలు పాటు సుంకం చెల్లించుకోవచ్చని చెప్పారు.

క్యాజువాల్టీ వైద్యులపై నంద్యాల ఎంపీ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్), జూలై 8: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు వచ్చిన అత్యవసర రోగికి ఇంత వరకు చికిత్స అందించలేదు.. ఇలా వైద్యం చేస్తే ఎలా..? అంటూ క్యాజువాల్టీ వైద్యులపై నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన 45ఏళ్ల రమణయ్య సోమవారం మధ్యాహ్నం నందికొట్కూరు పట్టణంలోని జీవన్‌జ్యోతి స్కూల్ వద్ద ద్విచక్ర వాహనం నుంచి కింద పడి గాయపడ్డారు. అతన్ని హుటాహుటిన బంధువులు మధ్యాహ్నం 3.45 గంటలకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే రోగిని వైద్యులు అసలు పట్టించుకోవడం లేదని బంధువులు నంద్యాల ఎంపీకి ఫిర్యాదు చేశారు. దీంతో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సాయంత్రం హాస్పిటల్‌కు చేరుకుని క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించారు. రోగికి సెలైన్ పెట్టి చేతులు దులుపుకుంటారా.. మూడు గంటలైనా ఇంత వరకు ఎందుకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయలేదని క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్‌పై మండిపడ్డారు.

● **వీల్ చైర్లు లేక ఇబ్బందులు:** క్యాజువాల్టీలో గత వారం రోజులుగా వీల్ చైర్లు లేక అత్యవసర రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ 300 మంది క్యాజువాల్టీకి రోగులు కేవలం 8 స్ట్రెచర్లు మాత్రమే ఉన్నాయని, వీల్ చైర్లు లేకపోవడం ఇబ్బందిగా మారిందని రోగులు బంధువులు అంటున్నారు. నంద్యాల ఎంపీ క్యాజువాల్టీలో ఉండగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది.



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బైరెడ్డి శబరి

బాబుకు వార్నింగ్ ఇచ్చేంత సీను జగన్‌కు లేదు

ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన గజదొంగ: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), జూలై 8: చంద్రబాబుకు వార్నింగ్ ఇచ్చేంత సీను జగన్‌కు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోచేసి, ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేసినందువల్లే ఇటీవల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పి, కనీసం ప్రతిపక్ష స్థానం లేకుండా చేసినా ఇంకా జ్ఞానోదయం కాలేదని మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను ధ్వంసం చేసిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిని జైలుకు వెళ్లి పరామర్శించడం..పైగా ఈవీఎంలు పగలకొడితే తప్పేంటని అనడం ఆయన నేర స్వభావాన్ని తెలియజేస్తోందని అన్నారు. సీఎం చంద్ర బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్నింగ్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే ఆయనకు ఇంకా బుద్ధి రాలేదని అర్థమవు తోందని అన్నారు. మరోసారి చంద్రబాబు మీద అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), జూలై 8: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.రంజిత్ బాషాను సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ భేటి అయిన నాగరాజు జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. సమస్యలు చెప్పుకోవడా నికి వచ్చిన ప్రజలతో అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకుని వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరారు. ఇక అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పరుస్తామని తెలిపారు.

మెస్ కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లో పెండింగ్‌లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్‌లో 11 నెలలుగా మెస్ బిల్లులు రాలేదన్నారు. ప్రిమెట్రిక్ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు నాలుగు నెలలుగా కాస్మోటిక్ చార్జీలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న వంట మనిషి, కమాటి వాచ్‌మన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు అమర్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు : టీడీపీ



మాట్లాడుతున్న కేఈ మల్లికార్జునగౌడ్

కోడుమూరు, జూలై 8: వంకపోరంబోకు స్థలాన్ని కబ్జా చేసి రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్ అన్నారు. గూడూరు మండలం చనుగొండ్ల పరిధిలో కబ్జాకు గురైన భూమిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంక పోరంబోకు భూమిని కొంత మంది కబ్జా చేసి వంకను పూడ్చి వేశారని అన్నారు. వంకను పూడ్చి వేడయం వలన వర్షపు నీరు పొలాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, దీని వలన కోడుమూరు రైతుల పంటలు నాశనం అవుతాయన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వాళ్లను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రగౌడ్, గోపాల్‌నాయుడు, ఎల్లప్ప నాయుడు, గంగాధర్ నాయుడు, రైతులు కుబేరరెడ్డి, రాజు, వేణుగోపాల్, గిడ్డయ్య పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

కర్నూలు(అర్బన్), జూలై 8: కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ కలిశారు. సోమవారం ఉదయం ఆయన చాంబర్లో శాలువతో సత్కరించి, బొకే అందించారు. నాయకులు బేతం కృష్ణ, త్రిలోక్ రెడ్డి, కుంపటి కృష్ణ ఉన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు సుమన్ అభినందన

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 8: ప్రముఖ సినీ నటుడు సుమన్ బళ్లారి చౌరస్తాలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో సోమవారం కలర్ బెల్టులు, మెడల్స్ సాధించిన తైక్వాండో క్రీడాకారులను అభినందించారు. అలాగే కోచ్ షబ్బీర్ హుశేన్ ఆధ్వర్యంలో తైక్వాండో క్రీడాకారులుగా తీర్చిదిద్ది పతకాలు సాధించడం సంతోషంగా ఉందని సుమన్ పేర్కొన్నారు. నగరంలోని వాణిజ్య నగర్‌లో సీపీఐ కార్యాలయంలో బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్‌బాషా హాజరై క్రీడాకారుల తైక్వాండో విన్యాసాలను చూశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: మహిళా వార్డెన్లను వేధించిన అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం టీఎస్ఎఫ్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ శాఖలో ఇద్దరు ఎస్సీ, ఎస్టీ వార్డెన్లను వేధింపులకు గురి చేసిన అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసి వదిలేయడం అన్యాయమన్నారు. ఆ ఇద్దరు ఎస్సీ, ఎస్టీ వార్డెన్లు భయంతో పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయలేక పోయారన్నారు. నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 8: నగరంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా బృందావన్‌నగర్ 11కేవీ ఫీడర్‌ల పరిధిలో 33కేవీ తీగల ఏర్పాటు చేయనున్నందున కరెంట్ కోత ఉంటుందన్నారు. ఈమేరకు బళ్లారి రోడ్, రాజీవ్‌నగర్, నిర్మల్‌నగర్, గోపినగర్, వాసవీనగర్, మల్లారెడ్డి రిచ్‌మండ్ సన్‌రైజ్ హోమ్స్, లక్ష్మీగ్రీన్‌సిటీ, గీతాంజలి వెంచర్ సమీపంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 8: సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని మానవ వనరుల మంత్రి నారా లోకేశ్‌కు ఆప్టా అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్‌రావుకు గుంటూరులో సోమవారం వినతి పత్రం అందజేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న బోధన బోధనేతర సిబ్బందికి, భవిత స్కూల్‌లో పని చేస్తున్న ఐఆర్‌టీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, పీడీలకు సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లకు అందరికీ జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చాయి. ధర్మపేట రైల్వే బ్రిడ్జి వద్ద మరుగుదొడ్లకు సౌకర్యాలు కల్పించాలని, దీపక్ ఆసుపత్రి వద్ద మురుగుకాలవలో పూడికతీత పనులు చేపట్టాలని, గుత్తిపెట్రోలకు బంకు సమీపంలోని శ్రీరామ్‌కాలనీ, శేషాద్రి నగర్ పక్కనే ఉన్న కరీంనగర్‌లో డ్రైనేజీలు నిర్మించాలని, వీకర్‌సెక్షన్ కానీ ఎన్టీఆర్ బిల్డింగులలో మున్సిపల్ పైప్‌లైన్ లీక్ అవుతుందని స్థానికులు కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ డి.వేణుగోపాల్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ భార్గవతేజ

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 8: పుట్టుకతో వచ్చిన లోపాలను సకాలంలో గుర్తించాలని కర్నూలు డీఎంహెచ్‌వో డా.వై. ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చర్ గ్యాలరీలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు స్టాఫ్ నర్సుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త హేమలత మాట్లాడుతూ జిల్లాలో కర్నూలు సర్వజన వైద్యశాల, ఆదోని ఏరియా ఆసుపత్రుల్లో సత్వర చికిత్స కేంద్రాలున్నాయని అన్నారు.

సనాతన ధర్మం.. విశ్వ కల్యాణానికి మార్గదర్శకం

కర్నూలు(కల్చరల్), జూలై 8: సనాతన హిందుత్వ ధర్మం విశ్వ కల్యాణానికి మార్గదర్శకమని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో వ్యవస్థాపకుడు మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో నాలుగో ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఎనిమిదోతరం ముని మనుమడు నొస్సం వీరం భట్లయ్య స్వామి, చిన్నటేకూరు సద్గురు నాగలింగేశ్వర జీవైక్య మఠాధిపతి ఎల్లప్ప స్వామీజీ, జూటూరు గురుసిద్ధ నాగసాయి బ్రహ్మ విద్యాశ్రమ పీఠాధిపతి సద్గురు రామానంద స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషి హర్షణీయం

ఓర్వకల్లు, జూలై 8: రాష్ట్రాభివృద్ధి, విభజన సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడు కృషి ప్రశంసనీయమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పాలనలో జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ప్రధానమంత్రి, వివిధ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పలు ప్రతిపాదనలను కేంద్రం ఆమోదిం చడం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జగన్ పాలనలో 30 సార్లు పర్యటన చేసి సాధించలేని అనేక సమస్యలను చంద్రబాబు ఒక పర్యటన తోనే సాధించారన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, సూర్యనారాయణ రెడ్డి, పుష్పరాజు, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 8: డీఎస్సీ, గ్రూప్-2, ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ కోరారు. సోమవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, హరి, విజయ్, వంశీ పాల్గొన్నారు.

● కర్నూలు జనాబాకు అనుగుణంగా తాగునీటి సమస్యల తలెత్తకుండా ఉండేందుకు మరో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మించాలని సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శివారు ప్రాంతాలలో ఇప్పటికీ డ్రైనేజీ, రోడ్లు నిర్మించలేద టన్నారు. నరసింహులు, సుధాకరప్ప, కే.ప్రభాకర్, అరుణ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 8: నగరంలోని కాలనీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. సోమవారం కమిషనర్ భార్గవతేజను కలిసి వినతి పత్రం అందజేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలోని కొన్ని ప్రాంతాలలో దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు పదిరోజులైనా తగ్గడం లేదన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



ఎమ్మెల్యే గౌరు చరితకు పుస్తకం అందజేస్తున్న బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు(కల్చరల్), జూలై 8: రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని సాగు నీటి సాధన సమితి వ్యవస్థాపకుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సాగునీటి సాధనా సమితి ఆధ్వర్యంలో, రాయలసీమ స్థితిగతులు, రాయలసీమ నీటి అవగాహన, రాయలసీమ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కలిసి నీటి అవగాహనపై రూపొందించిన పుస్తకాన్ని ఆమెకు అందజేశారు. రాయలసీమలోని నీటి ప్రాజెక్టుల పరిస్థితులను వివరించారు. గత ప్రభుత్వంలో తీసుకున్న జీవో వివరాలు ఎమ్మెల్యేతో చర్చించి, ఆ జీవోల ద్వారా సీమ ప్రాంతానికి జరిగిన నష్టాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు గత ప్రభుత్వంలో చాలా నష్టం జరిగిందని, సీమకు జరిగిన నష్టాన్ని రాయలసీమలో ఉన్న ఎమ్మెల్యేలను, ఎంపీలను కలిసి తెలియజేస్తామని, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సీమ సమస్యలను తీసుకుపోయే దశలో భాగంగా ఎమ్మెల్యేలను కలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి నాయకులు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్, ఏఆర్‌కే డేవిడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో కార్మికులకు చేతి నిండా పని



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గూడూరు, జూలై 8: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని లభిస్తుందని నగర పంచాయితీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. సోమవారం గూడూరు పాతబస్టాండు ప్రాంతంలో భారత తాపీ మేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని, అందులో భాగంగానే భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో భారత తాపీ మేస్త్రీ సంఘం గౌరవాధ్యక్షుడు గొండా కుమార్, సంఘం ప్రెసిడెంటు పైగేరి మధు వర్ధన్ రాజు, వైస్ ప్రెసిడెంటు రమేష్, ట్రెజరర్ ఇస్మాయిల్, సెక్రటరీ శ్రీనివాసులు, లాలుబాషా, గొండ వెంకట్రాముడు, అక్కలదేవి గిడ్డయ్య, వడ్డె లక్ష్మన్న, బొలు, కౌన్సిలర్లు బుడ్డంగిలి, షాషావలి, మాజీ కౌన్సిలర్ చాంద్‌బాషా, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



ఓర్వకల్లులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నటరాజ్

ఓర్వకల్లు, జూలై 8: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీవో మల్లేశ్వరి సూచించారు. సోమవారం ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల సేకరణ వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తహసీల్దార్, ఎంపీడీవోలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ రామయ్య, మండల వ్యవసాయ అధికారి సుధాకర్, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఏపీఎం లక్ష్మీకాంతరెడ్డి, ఏఈ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల సేకరణకు సోమవారం 9 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అనుమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సిబెళ గల్, పోలకల్లు, గుండ్రేవుల, కంబంధహాల్, ఇనగండ్ల గ్రామాల్లో నుంచి పొలం, రస్తా, పట్టాదారు పాసుబుక్‌ల కోసం దరఖాస్తులు అందాయన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

కర్నూలు(అర్బన్), జూలై 8: వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సుధాకర్ బాబు అన్నారు. సోమవారం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యాదర్శి దామోదరం రాధాకృష్ణ, ఉండ వల్లి వెంకటన్న, అనంరత్నం మాదిగ, లాజరస్, ఎస్. ప్రమీల, వెంకట సుజాత, సత్యరాజు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): నగరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. సోమవారం కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి ఏఎండీ ఇంతియాజ్ సహకారంతో దిన్నెదేవరపాడులోని కేర్ హోమ్స్ మిషన్ సొసైటీ వృద్ధా ఆశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేఎం.అన్వర్ హుస్సేన్, కుమార్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

● పేదల పెన్నిధి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే, డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్‌బీఐ కూడలిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అలీఖాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



వైఎస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: సి.బెళగల్‌లో సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైసీపీ నాయకులు ఎంపీపీ బొంతల మునెప్ప, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, సోమశేఖరెడ్డి, తులసిరెడ్డి పాల్గొన్నారు.

ఊరిస్తున్న తుంగభద్ర



తుంగభద్ర డ్యాంలో చేరిన వరద నీరు

- టీబీ డ్యాంకు చేరిన 20.85 టీఎంసీల వరద
- 30,388 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

కర్నూలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి వరద చేరికతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సోమవారం నీటి లెక్కలు తీసే సమయానికి డ్యాంలో 20.85 టీఎంసీలు వరద చేరింది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను 1599.47 అడుగుల వద్ద 20.85 టీఎంసీలు వరద చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 30,388 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. గత ఏడాది ఇదే సమయంలో 1576.72 అడుగుల్లో 3.08 టీఎంసీలు మాత్రమే నీరు ఉండేది. గతేడాదితో పోలిస్తే ఆశాజనకంగా వరద చేరడంతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీటి నిల్వలు పడిపోగా జూలై 28వ తేదీ నాటికి డ్యాంలోకి 59.001 టీఎంసీలు వరద చేరి 1.07 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 28న ఎల్లెల్సీకి సాగునీరు విడుదల చేశారు. తాజాగా 20.85 టీఎంసీలు వరద చేరడంతో తక్షణమే జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించి సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో తేల్చాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆశలు

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిధిలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ (బచావత్ అవార్డు)-1 మేరకు 24 టీఎంసీలు నికర జలాలు వాటా ఉంది. ఈ ఏడాది 2024-24 నీటి సంవత్సరం)లో 172 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని జూన్ 6న జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. బచావత్ అవార్డు దామాషా ప్రకారం కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలకు గానూ 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 10 టీఎంసీలకు గానూ 8.113 టీఎంసీలు కలిపి 27.585 టీఎంసీలు కేటాయించారు. అదే క్రమంలో డ్యాంలో 25 టీఎంసీలకు పైగా వరద చేరి.. ఇన్‌ఫ్లో ఆశాజనకంగా ఉంటే జూలై 20న కర్నూలు, అనంతపురం జిల్లాల జలవనరుల శాఖ ఎస్‌ఈలు ఇచ్చే ఇండెంట్ మేరకు ఎల్లెల్సీ హెచ్చెల్సీలకు సాగు నీరు ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రెండు రోజులు క్రితం కలెక్టరు పి.రంజిత్‌బాషా ఇరిగేషన్ ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో ఇదే అంశంపై ఇంజనీర్లతో చర్చించడమే కాకుండా టీబీ డ్యాంలో 25 టీఎంసీలకు పైగా వరద చేరగానే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం వరద చేరిక ఊరిస్తుండడంతో ఐఏబీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారు..? ఏ తేదీ నుంచి నీటిని విడుదల చేస్తారని ఆయకట్టు రైతులు అడుగుతున్నారు. అయితే.. సోమవారం ఉదయం 30,388 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంటే.. సాయంత్రానికి 21 వేలకు పడిపోవడం, ఎగువ నుంచి కూడా వరద తగ్గడంతో పంట కాలువలకు సాగునీటి విడుదలపై టీబీపీ బోర్డు ఇంజనీరింగ్ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.



ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు బోరుబావుల కింద పెంచుతున్న వరినారు

ఆర్మీ జవాన్ తల్లి స్థలం కబ్జా

తహసీల్దార్ వద్ద బోరున విలపించిన బాధిత మహిళ



తహసీల్దార్ వద్ద కన్నీరు పెట్టిన దాసరి లక్ష్మి

ఆదోని రూరల్, జూలై 8 : వైసీపీ నాయకుడు లక్ష్మన్న తమ స్థలాన్ని కబ్జా చేశాడని బాధిత మహిళ తహసీల్దార్ ఎదుట బోరున విలపించింది. ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటేశులు, లక్ష్మి దంపతులు ఆదోనిలో స్థిరపడ్డారు. వీరి ఒక్కగానొక్క కొడుకు దాసరి శ్రీనివాసులు ఆర్మీ జవాన్. వీరికి 1999లో అప్పటి ప్రభుత్వం రాయనగర్‌లో సర్వే నెం. 158లో రెండున్నర సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఆర్డీటీ సంస్థ ఒకటిన్నర సెంట్ స్థలంలో ఇల్లు కట్టించింది. నాలుగు సంవత్సరాల క్రితం వెంకటేశులు మృతి చెందడంతో లక్ష్మి ప్రస్తుతం ఆలూరులో బంధువుల వద్ద నివాసం ఉంటోంది. మూడు సంవత్సరాల క్రితం రాయనగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు లక్ష్మన్న ఈమె సెంటు స్థలాన్ని కబ్జా చేశాడు. ఆదోనికి చెందిన ఈరన్న, దానం, కప్పగల్ రెడ్డి న్యాయం చేస్తామంటూ ఆమె వద్ద నుంచి రూ.70వేలు వసూలు చేశారు. మోసపోయానని తెలిసిన దాసరి లక్ష్మి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, జయమనోజ్‌రెడ్డి చుట్టూ తిరిగింది. ఎట్టకేలకు జయమనోజ్ రెడ్డి వారి నుంచి రూ.60వేలను ఆమెకు తిరిగి ఇప్పించాడు. అయితే వైసీపీ నాయకుడు కబ్జా చేసిన స్థలాన్ని మాత్రం ఇప్పించలేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ప్రజా పరిష్కార వేదికలో సోమవారం బాధిత మహిళ తహసీల్దార్ హసినా సుల్తానాను కలిసి వినతిపత్రం అందించి బోరుమంది.

కడప ఆర్జేడీగా కర్నూలు డీఈవోకు అదనపు బాధ్యతలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 8: పాఠశాలల విద్యాశాఖ కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న వై. రాఘవరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ ఏర్పడిన ఈ స్థానంలో కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఏపీ టెట్ షెడ్యూల్‌లో మార్పులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 8: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. జూలై 2న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు జరగాల్సిన టెట్ పరీక్ష ఈ పరీక్షలను అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు వాయిదా వేసినట్లు తెలిసింది. ప్రిపరేషన్‌కు సమయం కావాలని అభ్యర్థులు కోరిన మీదట ఈ సవరణల నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. అక్టోబరు 27న ఫైనల్ కీని విడుదల చేస్తారు. నవంబరు 2న తుది ఫలితాలను ప్రకటించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

పోక్సో కేసులో వృద్ధుడికి జైలు, జరిమానా

కర్నూలు(లీగల్), జూలై 8: నాలుగు సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన 75 ఏళ్ల నిందితుడికి ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జి. భూపాల్ రెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. 2020 నవంబరు 18న జిల్లాలోని ఓ గ్రామంలో.. ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన నిందితుడు తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లి ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ శృతి నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతని వయస్సును దృష్టిలో పెట్టుకుని ఐదేళ్ల కారాగారార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున వంగాల వెంకటేశ్వరరెడ్డి వాదించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు

కర్నూలు(లీగల్), జూలై 8: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ. లీలా వెంకట శేషాద్రి కోరారు. హెల్మెట్ల ధారణపై సోమవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన ఓ అవగాహన సదస్సులో మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం కింద హెల్మెట్లు ధరించని వాహనదారులకు శిక్షలు పడతాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

నంద్యాల కానిస్టేబుల్‌కు పతకం



అభినందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల (క్రైమ్), జూలై 07: అస్సాంలోని గోహతిలో జరిగిన 9వ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 24-25 జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో నంద్యాలకు చెందిన కానిస్టేబుల్ పరహాతుల్లా పతకం సాధించారని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి సోమవారం తెలిపారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు జరిగిన పోటీల్లో పురుషుల కరాటే, పెన్కాకోసిలాట్ థైక్వాండో విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏపీ పోలీస్ శాఖ నుంచి 16మంది పాల్గొన్నారు. నంద్యాల జిల్లా నుంచి నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్ నుంచి పరహాతుల్లా థైక్వాండో విభాగంలో పాల్గొని బ్రాంజ్ మెడ్ సాధించడం గర్వకారణమన్నారు. సోమవారం ఎస్పీ చాంబర్‌లో పరహాతుల్లాను అభినందించారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కలెక్టర్ జి. రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 7: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన విన్నతులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తులోని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టంకు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, వీఆర్వోలు సరిగా పని చేయడం లేదనే విషయం స్పష్టమతోందన్నారు. కార్యక్రమంలో 123 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు.

అధికారులు పని వేళలు పాటించాలి

జిల్లా అధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు సేవలందించండలో ఫైల్ ఈ ఆఫీస్ ద్వారానే రావాలన్నారు. కింది స్థాయి గుమాస్తా నుంచి పైస్థాయి అధికారి వరకు ఈసైన్‌తోనే ఫైల్ రావాలని కలెక్టర్ సూచించారు. కోర్టు కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సెలవులో వెళ్లవలసి వస్తే మూడు రోజులు ముందుగానే అనుమతి తీసుకోవాలని అన్నారు.

ఏమిచ్చి ప్రజల రుణం తీరుకోగలను?

- ఢిల్లీలో నందికొట్కూరు పేరు నిలబెడతా..
- నెల రోజులుగా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూస్తున్నాం
- నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి



ర్యాలీకి భారీగా తరలి వచ్చిన జనాలు

నందికొట్కూరు, జూలై 08: ఓటర్లు తమ ఆడబిడ్డగా భావించి ఎన్నికల్లో గెలిపించారని, ఏమిచ్చి వారి రుణం తీర్చుకోగలను? అని నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి అన్నారు. నంద్యాల ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా నందికొట్కూరు నియోజకవర్గానికి వచ్చిన బైరెడ్డి డా. శబరికి నందికొట్కూరు టీడీపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. నందికొట్కూరు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించినందుకు నందికొట్కూరు పేరును పార్లమెంటులో నిలబెడ తానని అన్నారు. ఐదేళ్ల పాటు అంధకార ఆంధ్రప్రదేశ్‌ను చూశామని, టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ నెలలో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూస్తున్నామని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు పెంచిన పింఛన్లు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవ్వాతాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడన్నారు. త్వరలోనే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 పథకాన్ని ముఖ్యమంత్రి అమలు చేస్తారన్నారు. యువత, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచే వ్యూహంతో చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారని అన్నారు. నియోజకవర్గానికి నీళ్లు తీసుకొచ్చేందుకు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోనే అభివృద్ధిలో నందికొట్కూరును నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఆమె ప్రసంగం జరుగుతుండగా ఉక్కపోతతో స్పృహ కోల్పోయిన ఓ యువకుడిని స్టేజ్‌పైకి తెప్పించుకొని ఎంపీ డా. బైరెడ్డి శబరి ప్రథమ చికిత్స అందించారు.



మాట్లాడుతున్న బైరెడ్డి డా.శబరి

నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా..: బైరెడ్డి

చంద్రబాబు నాయుడు డా. బైరెడ్డి శబరి ప్రతిభను గుర్తించి టిక్కెట్ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బైరెడ్డి శబరి ఇక నుంచి 'మీ బిడ్డ అని, మీ చేతుల్లో పెడుతున్నానని, ఆమె భవిష్యత్తు మీదే' అని ఆయన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకరవాడ చిన్న వెంకటస్వామి, తెలుగుయువత రాష్ట్ర నాయకులు మహేష్ నాయుడు, నాగేశ్వరరావు, సాహెబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జూలై 8: శ్రీశైలం దేవస్థానంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 3 వరకు శ్రావణ మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు శ్రావణ మాసోత్సవాల ఏర్పాట్లపై పరిపాలనా భవనంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, సీనియర్ వేద పండితులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ శ్రావణ మాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని ఆయా విభాగాలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా శ్రావణ సోమవారాలు, శ్రావణ పౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శుద్ధ, బహుళ ఏకాదశి, శ్రావణ మాస శివరాత్రి, సెలవు రోజుల్లో అత్యధికంగా భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సౌకర్యవంతమైన దర్శనం, వసతి, తదితర సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రావణ మాసంలో ఆగస్టు 15 నుంచి 19 వరకు ఐదు రోజులపాటు భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి స్పర్శ దర్శనాన్ని నిలుపుదల చేసి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి కల్పించనున్నట్లు తెలిపారు. మిగిలిన రోజుల్లో నిర్దిష్ట వేళలలో రోజుకు నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే భక్తుల రద్దీ కారణంగా శ్రావణ శని, ఆది, సోమవారాలు, స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీవ్రతం, పౌర్ణమి మొదలైన రోజుల్లో మొత్తం 16 రోజులు స్వామివారి గర్భాలయ, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. శ్రావణ మాసంలో రెండు పర్యాయాలు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపించనున్నారు. అదేవిధంగా లోకకల్యాణం కోసం శ్రావణమాసమంతా ఏడు భజన బృందాలతో అఖండ చతుస్సప్తాహ శివభజనలు నిర్వహించనున్నారు.

కక్ష సాధింపులను ప్రోత్సహించం

రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి



కార్యకర్తలతో గ్రామ సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

కొలిమిగుండ్ల, జూలై 8: తెలుగుదేశం పార్టీ పాలనలో కక్ష సాధింపులను ప్రోత్సహించమని, అదే సందర్భంలో అవినీతికి పాల్పడిన అధికారులను, నాయకులను వదిలి పెట్టబోమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం మొదటిసారి మంత్రి హోదాలో కొలిమిగుండ్ల మండలానికి విచ్చేసిన బీసీ జనార్దనరెడ్డికి టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బెలుం గుహల ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, గ్రామాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి బీసీ మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, తాగునీటి సరఫరా, వ్యవసాయం తదితర అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని, అభివృద్ధిని అటకెక్కించారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపడతామన్నారు. పునర్నిర్మాణమే లక్ష్యమంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించామని, కేంద్రం సానుకూలంగా స్పందించిందని బీసీ వివరించారు. రహదారులు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గత పాలనలో అవినీతికి పాల్పడి, అక్రమ కేసులు పెట్టిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టమని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరారెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, గొంగటి హుస్సేన్ రెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, అంకిరెడ్డిపల్లె నారాయణరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, ఉలువల నరసిం హుడు, నాగేశ్వరరెడ్డి, కమ్మవా రిపల్లె రాందాస్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, జూలై 8: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య భవన్‌లో ఆయన కార్మికులు, చిన్నపిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ రైతు బాంధవుడుగా పేరొంది ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన మహనీయుడు వైఎస్ అని కొనియాడారు.

వ్యక్తి ఆత్మహత్య

గడివేముల, జూలై 8: మండలంలోని కొరటమద్ది గ్రామానికి చెందిన నాగమద్దిలేటి (44) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నాగమద్ది లేటి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మద్యం మేహం, బీపీ వ్యాధితో బాధపడుతున్న నాగమద్దిలేటి జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చంద్రన్న బీమాకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: జూన్ 30 వరకు సహజ, ప్రమాదవశాత్తు మరణించిన వారి బంధువులు చంద్రన్న బీమాకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా సోమవారం తెలిపారు. క్లెయిమ్స్ సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు.

రన్‌వే ఎక్స్‌టెన్షన్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 8: ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో రన్‌వే ఎక్స్‌టెన్షన్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర పి. రంజిత్ బాషా ఎయిర్‌పోర్టు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులో రన్‌వే ఎక్స్‌టెన్షన్‌కు కావాల్సిన నిధులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశిం చారు. విమానాలు రాత్రి సమయంలో ల్యాండ్ అయ్యేందుకు గాను రన్‌వేలో కల్పించాల్సిన సౌకర్యాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శేషిరెడ్డి, డీపీవో నాగరాజనాయుడు, ఓర్వకల్లు తహసీల్దార్ నటరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, జూలై 8: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై కాల్వబుగ్గ ఏపీఆర్ పాఠశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఒకరు మృతి చెందారు. నెల్లూరు జిల్లా వేదాయపాలెం గ్రామానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ప్రసాద్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ద్విచక్రవాహనంపై వెళ్తున్న మౌలాలి (74)ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మౌలాలికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో విగ్రహాల దొంగతనం

బేతంచెర్ల, జూలై 8: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.50 లక్షల విలువ చేసే రెండు విగ్రహాలను దొంగతనం చేశారు. ఆలయంలోని వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచలోహ విగ్రహాలను దొంగలు అపహరించుకుని వెళ్లారు. వీటి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి క్లూజ్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత ఇసుక నిర్ణయం హర్షణీయం

- ప్రభుత్వం ఏర్పాటైన 20 రోజుల్లోనే ఇసుక పాలసీ అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూలై 8: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు ప్రభుత్వం కొత్త పాలసీని తేవడం హర్షణీయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని అందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దోపిడీని అరికడుతూ సులభతరంగ ప్రజలకు ఇసుకను అందించేందుకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలతో పాటు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇసుక లభించక ఇబ్బంది పడుతున్న అన్ని రంగాలకు నేడు ఇసుక సమృద్ధిగా లభించి భవన నిర్మాణ రంగాలు వేగవంతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆర్థికంగ ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రకృతి వనరుల నుంచి సంపాదించే ప్రభుత్వాలను చూశామని, అయితే వనరుల నుంచి సంపదను సృష్టించి ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ నిర్మాణాలకు సంబందించి ఇబ్బందులు కలగకుండ ఇసుక రీచ్‌లను పెంచే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

● అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పట్టణంలోని 11వార్డులో అగ్నిప్రమాదం జరిగి గుడిసె దగ్ధమై రూ.లక్ష ఆస్తినష్టం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వెంటనే స్పందించి వార్డు మాజీ కౌన్సిలర్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బాధిత కుటుంబానికి పది కేజీల బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. అగ్ని ప్రమాద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ పై జీవో అమలు చేసిన సీఎం

ఆదోని, జూలై 8: ఏపీలో ఇసుక పాలసీ పై జీవోను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ, సర్కారు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈమేరకు జీవో నెం. 43ను జారీ చేసిందని, వినియోగదారుడు ఎత్తుడు, దించుడు కూలీతో ఇతర చట్టబద్ధమైన పన్నులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. నిరుపేదతలు సొంత ఇల్లు కట్టుకోవడానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 20 రోజుల్లోనే అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడితేనని కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల్లో ఆనందం


ఉచిత ఇసుక కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కౌతాళం, జూలై 8: పేదలకు ఉచిత ఇసుక విధానంను ప్రభుత్వం సోమవారం నుంచి అమలు చేయడంతో భవన నిర్మాణ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రాలయం టీడీపీ నాయకులు రామకృష్ణ రెడ్డి, కౌతాళం మండల కన్వీనర్ ఉలిగయ్య గుడికంబాలి గ్రామంలో నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను తీసుకోవాలంటే దళారుల వ్యవస్థ వల్ల అదనపు బారంతో అప్పుల పాలయ్యారని తెలిపారు. ఇక నుంచి ఇసుకను రీచ్‌ల వద్ద టన్నుకు రూ.335 చెల్లించి రవాణా ఖర్చులను లబ్ధిదారుడు భరిస్తే నేరుగా ఇంటికి ఇసుక చేరుతుందని వివరించారు. కోసిగి, పెద్దకడబూరు మండల కన్వీనర్లు జ్ఞానేష్, బసలదొడ్డి ఈరన్న, కోసిగి నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, ముత్తరెడ్డి, మంత్రాలయం మాజీ జడ్పీటీసీ లక్ష్మన్న తదితరులుపాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ఆర్డీటీ లక్ష్యం

మంత్రాలయం, జూలై 8: గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతే ఆర్డీటీ లక్ష్యమని స్పెయిన్ దేశానికి చెందిన ఫిలా, శివ్య, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సరస్వతి అన్నారు. సోమవారం మండలంలోని రాంపురంలో ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రంథాలయాల నిర్వహణ, ఆర్డీటీ అందిస్తున్న సేవలు వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలతో పాటు పెద్దలు సైతం నిరక్షరాస్యులు కాకుండా అక్షరాస్యులుగా మారి న్యూస్ పేపరు చదివే అవగాహన పొందాలన్నదే తమ ధ్యేయమన్నారు. ఆర్డీటీ ద్వారా అనేక మంది పేదలకు గృహాలు, ఆరోగ్యం, విద్య, భూముల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ నరసింహుడు, గ్రామ వర్కర్స్ వీరస్వామి, వీరేష్, భాస్కర్, మండలంలోని మహిళలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ ట్యాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

ఆలూరు, జూలై 8: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 1 నుంచి 12 తరగతులకు నిర్వహించే ఒలింపియాడ్ టాలెంట్ టెస్టు ఫలితాల్లో ఆలూరు ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ గురునాథ్ మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా 70 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొనగా, 40 మంది విద్యార్థులు రెండవ రౌండ్‌కి ఎంపిక అయ్యారన్నారు. 40 మందిలో ముగ్గురు విద్యార్థులు మంజునాథ్ స్వామి, 4వ తరగతిలో మెహబూబ్ బాష, 6వ తరగతిలో ఫర్హాన, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

పత్తికొండ మాజీ జడ్పీటీకీకి ఎంపీ దంపతుల పరామర్శ

పత్తికొండ, జూలై 8: పత్తికొండ మాజీ జడ్పీటీసీ హోటల్ శ్రీనివాసులును సోమవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు, భార్య బస్తిపాటి జయసుధ పరామర్శించారు. సుగర్ కారణంగా శ్రీనివాసులు ఎడమకాలు ఇన్ఫెక్షన్ కావడంతో బెంగళూరులో సర్జరీ చేశారు. ఆసుపత్రి నుంచి ఇంటికివచ్చిన ఆయనను ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

రైతులకు జింకల బెడద

ఆదోని టౌన్, జూలై 8: ఆదోని మండలంలోని అనేక గ్రామాల్లో జింకలు, కోతులు బెడద విపరీతంగా ఉండటంతో రైతులు తమ పంటలను తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో కనిపించని ఈ మూగజీవాలు ప్రస్తుతం వందలాది సంఖ్యలో ఒకేసారి రైతుల పంటల పై దాడి చేస్తూ పంటల నాశనానికి కారణం అవుతన్నాయని, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి వీటిని అడువులలో తిండి, తాగునీరు దొరికే ప్రాంతాలకు తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు.

జింకల నుంచి పంటను కాపాడండి

ఆస్పరి : మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలను జింకల నుంచి కాపాడాలని రైతు సంఘం జిల్లా సహకారదర్శి హనుమంతు, మండ నాయకుడు రామాంజనేయలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందించారు. జింకల సమస్య నివారణకు జింకల పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుందరరాజు, సుదర్శన్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే సీరియస్

- సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, జూలై 08 : గ్రామ సచివాలయాల్లో విధుల్లోభాగంగా, రైతుభరోసా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయక అధికారులు చేతివాటం ప్రదిర్శంచి రైతులకు అందాల్సిన పెట్టుబడి రాయితీ పక్కదారి పట్టించి బంధు వర్గాల ఖాతాలకు నిధులు మళ్లించడంతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం 'నిండా మోసం' అనే శీర్షికను ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థ సారధి లబ్ధిదారుల రైతులకు అందాల్సిన పెట్టుబడి సహాయ నిధులను పక్కదారి పట్టించిన సచివాలయ ఉద్యోగులపై సమగ్ర విచారణ జరపాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించాడు. ఎమ్మెల్యేతోపాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం ఏఓ ఆశోక్ కుమార్ రెడ్డి పెద్దహరివాణం ఆర్బీకే-2 సెంటర్‌కెళ్ళి అటు రైతులతో, ఇటు అవినీతికి పాల్పడ్డ సిబ్బందిని విచారించారు. నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నామని ఏఓ ఆంధ్రజ్యోతికి తెలిపారు. అయితే మండలంలోని చాలా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయక కార్యదర్శులు చేతివాటాన్ని ప్రదర్శించారని, వీరిపై కూడా విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హెచ్‌ఎం భాస్కర్‌బాబుకు ఘన సన్మానం


హెచ్‌ఎం భాస్కర్‌బాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం, జూలై 8: మాధవరం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ఆరేళ్లుగా పని చేసి పదవీ విరమణ పొందిన భాస్కర్‌బాబు దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం షేకూన్‌బీ, రామ్మోహన్, సీఆర్‌పీలు నర్సన్నగౌడు, బంగారప్ప, భీమేష్‌ల ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించి వారి సేవలను కొనియాడారు. అనంతరం శాలువ, పూలమాలలుతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న, కాంప్లెక్స్ ఛైర్మన్ బోజరాజు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎల్లప్ప, నాగమణి, అరవింద, హెచ్‌ఎంలు సత్యనారాయణ, నాగభూషణం, భాస్కర్, ఈశ్వరయ్య, నాగేంద్రప్ప, ప్రభాకర్, ఏఈ వినూత్న పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 8 : ఎమ్మిగనూరు పట్టణంలో చిన్నకమేలా వీధిలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమయింది. బాధితులు రఫీక్ తెలిపిన వివరాల మేరకు ఉదయం పూజ కార్యక్రమం ముగించుకొని కూలి పనికి వెళ్లగా.. ఇంట్లో పెట్టిన దీపం పడిపోయి ఇంటికి నిప్పు అంటుకొని ఇంట్లో వున్న బియ్యం,బట్టలు వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. నిలువునా నీడ లేకుండా పోయిందని మొత్తం రూ లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని కన్నీరు పెట్టారు.

చంద్రబాబుతోనే ప్రగతి

హాలహర్వి, జూలై 8: గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని జెడ్పీటీసీ లింగప్ప అన్నారు. సోమవారం జెడ్పీ నిధులు కింద నిట్రవట్టి గ్రామంలో రూ.10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. జగన్ పాలనలో ఐదేళ్లలో పల్లెల్లో అభివృద్ధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచు బసప్ప, లక్ష్మణ్ణ, సదాశివ పాల్గొన్నారు.

అధికారులు రారు.. కార్యాలయాలు తెరుచుకోవు..

తుగ్గలి, జూలై 8: అధికారులు రాకపోవడం కార్యాలయాలు తెరుచుకోక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల కోసం ఎదురు చూసి మధ్యాహ్నమైనా రాకపోవడంతో నీరసనంగా వెనుదిరిగారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయ అధికారుల కోసం వచ్చిన రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. 'పంటల సాగుపై వ్యవసాయాధికారులను సంప్రదించడానికి వస్తే ఇంకా తెరవకపోతే ఎలా' అంటూ రైతులు ప్రశ్నించారు. పంటల సాగు సమయంలో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు.

వైసీపీ నాయకుడి బరితెగింపు


వైసీపీ నాయకుడి ఇంటి నిర్మాణానికి వాడిన సాతనూరులోని ప్రభుత్వ పాఠశాల ఇటుకలు ఇవే.

కోసిగి, జూలై 8: గ్రామాల్లో వైసీపీ నాయకుల తీరు ఇంకా మారలేదు. వైసీపీ అధికారం కోల్పోయినా వాళ్ల దాష్టీకాలు ఆగిపోలేదు. కోసిగి మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో నాడు-నేడు ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం తెచ్చిన ఇటుకలు, కడ్డీలను సాతనూరు గ్రామానికి చెందిన మర్రిస్వామి ఆదివారం తమ ఇంటి నిర్మాణానికి తరలించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి సహకారంతోనే వైసీపీ నాయకుడు ఈ విధంగా బరితెగించాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతం లో మర్రిస్వామి వదిన శివమ్మ సాతనూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పని చేసేవారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి వారికి సన్నిహితంగా ఉంటూ వైసీపీకి అనుకూలంగా ఉండేవారు. ఇదే అదునుగా భావించి పాఠశాల నిర్మాణం కోసం తెచ్చిన ఇటుకలను యథేచ్ఛగా తమ ఇంటికి తరలించారు. విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైసీపీ నాయకుడే ఇటుకలు తీసుకెళ్లాడు

గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మర్రిస్వామి వదిన గతంలో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకురాలిగా పని చేసేవారు. మాకు తెలియకుండా వారు ఇటుకలను, కడ్డీలను తీసికెళ్లారు. వారిని మంద లించాం. 20 ఇటుకలు మాత్రమే తీసుకెళ్లామని వారు చెప్పారు. ప్రభుత్వ సొమ్మును అలా తీసుకెళ్లడం నేరం. వారిపై చర్యలు తీసుకుంటాం.

- శ్రీదేవి, సాతనూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

- కర్నూలు ప్రజావేదికలో కలెక్టర్‌కు వినతులు

ఎమ్మిగనూరు , జూలై 8: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ రంజిద్‌బాషాకు విన్నవించారు. సోమవారం కర్నూలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మిగనూరుకు చెందిన యూఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్‌కుమార్, పీఎస్‌యు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షులు శేఖర్ కలెక్టర్ రంజిద్‌బాషాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే ఎమ్మిగనూరులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఎమ్మిగనూరు మండలం గుడికల్లుకు చెందిన రంగయ్య గ్రామ పొలిమేరలో సర్వే నెంబర్ 155,156లో 1.52 ఎకరాల భూమి ఉందని అడంగల్‌లో నమోదు చేయాలని అర్జి ఇచ్చారు. గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన రంగస్వామి, దాదాసాహెబ్, సలాంసాహెబ్, భాస్కర్ గ్రామ పొలిమేరల్లో 50 ఎకరాల భూమి ఉందని, ఈ భూమికి ఉన్న రస్తాను గ్రామంలోని ఇతరులు ఆక్రమించుకున్నారని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహించే ప్రభుత్వ వైద్యులపై చర్యలకు డిమాండ్

ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తూ ప్రైవేటు క్లినిక్‌లు నడుపుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకులు రాజు, మహేంద్రబాబు, సురేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి, తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు ప్రైవేటు క్లినిక్‌లు పెట్టి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణనాయుడు, ఇమ్రాన్, నరసింహారెడ్డి, తేజా, ఫారుక్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో బీకాం కోర్సు కొనసాగించాలి

ఎమ్మిగనూరు రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం కోర్సును ఎత్తివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని యథావిధిగా కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్లు ప్రకటించిందని, ఇది సరైన నిర్ణయం కాదని, ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పార్లమెంట్ పరిధిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- కర్నూలు ఎంపీ బస్తిపాటినాగరాజు


మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

పత్తికొండ, జూలై8: వచ్చే ఐదేళ్లకాలంలో కర్నూలుపార్లమెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధిచేస్తామని ఎంపీ బస్తిపాటినాగరాజు అన్నారు. సోమవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ స్థాయిలో రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం ఎన్నికల హామీలునెరవేరుస్తూ ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ పనులపూర్తికి కృషిచేసి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పరిశ్రమలమంత్రిగా జిల్లాకు చెందిన టీజీ భరత్ ఉన్నారని, ఆయన సహకారంతో పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పత్తికొండ నియోజకవర్గానికి భారీ ఫ్యాక్టరీని తెచ్చేందుకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కృషిచేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీల ఏర్పాటుద్వారా స్థానిక యువతకు ఉద్యోగఅవకాశాలు కల్పించగలుగుతామని వివరించారు. టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, శ్రీదర్‌రెడ్డి, రమేష్, గుడిసెనరసింహులు, కడవల సుధాకర్, రాజేష్ చౌదరిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి

ఆదోని టౌన్, జూలై 8: కాంగ్రెస్ పార్టీకి చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీలకు అతీతంగా సేవలు అందించడంలో ఆయనకు ఎవరూ సాటి లేరని కీర్తించారు. నాయకులు అమరావతి ఖలందర్, కల్లుబావి రామన్న యాదవ్, బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి విభాగం నాయకులు రోగులకు పండ్లు, బెడ్లు అందజేశారు.

ఎమ్మిగనూరు టౌన్ : వైసీపీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు వై.రుద్రగౌడ్. బసిరెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ రఘు పాల్గొన్నారు.

రీయల్టర్ల మోసాలతో నష్టపోయాం..

- స్పందనలో బాధితులు ఫిర్యాదులు

పత్తికొండ టౌన్, జూలై 8: రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన వెంచర్లలో నెలనెలా డబ్బు కట్టి మోసపోయామని, మాకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. పత్తికొండ సమీపంలోని శ్రీ సాయి గణేష్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దేవదాయ భూముల్లో 696 సర్వే నెంబరులో వెంచర్లు వేసి నెల నెలా లబ్ధిదారుల నుంచి డబ్బు వసూళు చేశారని పేర్కొన్నారు. తీరా ఈ ప్లాట్లు రిజిస్ట్రేషన్ కావని తెలిసి తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంచర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

బీసీ ప్రీమెట్రిక్ గర్ల్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

ఆదోని (అగ్రికల్చర్), జూలై 8 : ఆదోని పట్టణంలో బాలికలకు బీసీ ప్రీమెట్రిక్ బాలికల హాస్టల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బాలికల తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. హాస్టల్ సీట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండక వలసలు వెళ్తున్నారని, తమ పిల్లలను హాస్టల్లో వదిలి చదివిద్దామంటే, హాస్టళ్లు లేక మధ్యలోనే చదువులు మానేసే పరిస్థితి నెలకొందని అన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వితనిపత్రం అందజేశారు. నాయకులు గౌస్, శశిధర్, మోహన్, నాగరాజు, అమ్రేష్ పాల్గొన్నారు.

జగన్ తాటాకుచప్పుళ్లకు టీడీపీ భయపడదు : కోట్ల

పత్తికొండ, జూలై8: జగన్ తాటాకుచప్పుళ్లకు టీడీపీ భయపడదని డోన్‌ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పత్తికొండలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డిలాగే జగన్ మంచిచేస్తాడని, నమ్మిప్రజలు ముఖ్యమంత్రిని చేశారని అన్నారు. ఐదేళ్ల జగన్ దుర్మార్గపాలనతో రాజశేఖర్‌రెడ్డికి జగన్‌కు తేడాను ప్రజలు గుర్తించారని, భవిష్యత్‌లో ప్రజలు జగన్‌ను నమ్మేపరిస్థితిలేదని స్పష్టం చేశారు. సుమారు 70వేల మందిపై జగన్ అక్రమకేసులు బనాయించి గుండాలతో, రౌడీలతో దాడులు చేయించాడని, ఇప్పుడు నీతులుచెబుతున్నాడని ఎద్దేవాచేశారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని ప్రగల్బాలు పలుకుతున్నారని, ఈ సారి జగన్ పులివెందులలో కూడా ఓటమి కావడం తథ్యమని జోస్యం చెప్పారు. ప్రజల వద్దకువెళ్లి వారి సమస్యలు తెలుసుకొని అభివృద్ధి కోసం ముందుకు సాగడమే టీడీపీ లక్ష్యమన్నారు. టీడీపీ నాయకులు ప్రబాకర్‌రెడ్డి,శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ వారాలు

ఆదోని టౌన్, జూలై 8: పొలిమేరలోని కొండ గుహలో కొలువైన రేణుకా ఎల్లమ్మ వారాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణ శివారులోని కొండ పై వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆషాడమాస ఉత్సవాలు ఈనెల 9వ తేదీ నుండి ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి వంశపారంపర్య ధర్మకర్తలు ప్రసాద్ సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 23వ తేదీన గంప జాతర, 30వ తేదీన ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

ఆస్పరి, జూలై 8: మండలంలోని పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మునిస్వామి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. 8 వారాలకు సంబంధించిన పెండింగ్ వేతనాలు సుమారు రూ.1కోటి పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రైతుల పంట నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, మల్లయ్య, హనుమంతు, రంగనాథ్ పాల్గొన్నారు.

శిలాఫలకాలు పగులకొట్టారు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 8: మద్దికెర గ్రామంలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రధాన చెరువైన మద్దమ్మకుంటకు రూ.2 కోట్ల ఖర్చు పెట్టి హంద్రీనీవా కాలువ నుంచి పైపులైన్ వేసి నీటి సరఫరా చేయడంతో 2019లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకాన్ని సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టారు. విషయంతెలుసుకున్న జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు కరువు

మద్దికెర, జూలై 8 : ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం- ప్రజా సమస్యల పరిష్కార వేదికను అమలు చేసింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు కరువయ్యాయి. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేధిక జరగాల్సి ఉండగా.. ఆన్‌లైన్ పని చేయకపోంవడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి మార్చారు. ఈ విషయం ప్రజలకు తెలియకపోవడంతో ఒక్క వినతి కూడా రాలేదు.

సంక్షిప్త సమాచారం

రేపు మార్కెట్ వేలం పాటలు

గోనెగండ్ల, జూలై 8: మండల కేంద్రమైన గోనెగండ్లలోని సంతమార్కెట్, కమేళా, బండిమెట్ట ల వేలం పాటలను బుధవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీ కి రూ. 20వేలు డిపాజిట్ చేయాలని అలాగే పంచాయితీలో బకాయిలు ఉండరాదని తెలిపారు.

త్వరలో పుడికతీత పనులు పూర్తి: టీడీపీ

నందవరం, జూలై 8: మండల కేంద్రంలో తాగునీటి పనులు త్వరలో పూర్తి చేస్తామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ దేశాయి మాధవరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నందవరంలో తాగునీటి ప్రయోజనాల కోసం తిమ్మరెడ్డి కుంటలో పూడిక తీత మరమ్మతు కోసం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి రూ 6 లక్షలు మంజూరు చేశారని, ఈ పనులు ముగిసిన వెంటనే ఇంటింటికి తాగునీటి కోళాయి కనెక్షన్లు కోసం ఎమ్మెల్యే బీవీ శ్రీకారం చుడతారని పేర్కొన్నారు.

కబరస్తాన్ కొట్టాల్లో నీటి ట్యాంకు పునఃప్రారంభం

ఎమ్మిగనూరు , జూలై 8: పట్టంలోని కలుగొట్ల రోడ్డు కబరస్తాన్ కొట్టాలలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకును ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో మరమ్మతులు చేసి పునః ప్రారంభించారు. సోమవారం ట్యాంకును సామాజిక కార్యకర్త మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు ప్రారంభించి స్థానికులకు తాగునీటిని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఉసేన్‌బాషా, మక్బుల్, అరున్, సలాం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎమ్మిగనూరు , జూలై 8: అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, రాముడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీడీపీవోను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 42 రోజుల సమ్మెకాల ఒప్పంద జీవోను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు శైలజ, నాగలక్ష్మి, మున్నీసాబేగం, పార్వతి, జయమ్మ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

మద్దికెర, జూలై 8: మద్దికెర గ్రామంలోని ఎరువులు ,విత్తనాలు, పురుగు మందులు అమ్మే దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏడీఏ హనుమంతరావు ఆధ్వర్యంలో గ్రామంలోని మూడవు ఎరువులు దుకాణాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఉమ్మడి కర్నూలు జిల్లాల షపుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఉప్పర రవి, వ్యవసాయ సిబ్బంది ఆనంద్ నాయక్ తదితరులు ఉన్నారు.

269 కేజీల టమోటా, మిరప విత్తనాలు సీజ్

పత్తికొండ,జులై8: పత్తికొండలో రికార్డులులేకుండా విక్రయిస్తున్న 269కేజీల టమోటా, మిరప విత్తనాలను సీజ్‌చేసినట్లు విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పత్తకొండ పాతపేటలోని శ్రీరామా ఆగ్రోట్రేడర్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులతనిఖీల్లో 269కేజీల విత్తనాలకు అనుమతులులేవని, వీటివిలువ సుమారు3,73,000 ఉంటుందని పేర్కొన్నారు. ఆయనతోపాటు ఏడీఏ విజయ్‌మోహన్‌కుమార్, ఏవో వెంకట్రాముడు, విజిలెన్స్ కానిస్టేబుల్ రిజాజ్‌బాషా ఉన్నారు.

నవ బృందావనంలో శ్రీమఠానికి తొలగిన అడ్డంకులు

మంత్రాలయం, జూలై 8: రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి, గురువులు వెలసిన నవబృందావనం గడ్డపై రాఘవేంద్రస్వామి మఠానికి రాకపోకలు సాగించేందుకు అడ్డంకులు తొలగిస్తూ కర్ణాటక హైకోర్టు తీర్పు రాకతో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో పాటు శిష్యులు సంబరాలు జరుపుకున్నారు. ఉత్తరాధి మఠం నవబృంధావనం గడ్డపై శాశ్వత హక్కులు తమకే ఉన్నాయని కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 3న రాఘవేంద్రస్వామి మఠానికి నవబృందావన గంగావతి సమీపంలో నవ బృందావనం గడ్డపై రాకపోకలు సాగించేందుకు రాఘవేంద్రస్వామి మఠానికి అనుకూలంగా తీర్పు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీమఠం గోశాలకు రూ.లక్ష విరాళం : రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు రూ.లక్ష గోసంరక్షణకు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని గోశాలకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.